# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ ప్రాంతీయ శాంతి పునరుద్ధరణకు చర్చలు, దౌత్యం విధానాలను అనుసరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు.

❖ నాగరిక సమాజంలో హింస, తీవ్రవాదానికి స్థానం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.

❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

❖ వాయువ్య, ఈశాన్య భారతదేశంలో రానున్న మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

==========================

ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య దాడులు తీవ్రతరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ఫోన్ లో మాట్లాడారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ప్రస్తుత పరిణామాలపై చర్చించామని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా వెల్లడించారు. తక్షణం ఉద్రిక్తతలను తగ్గించి ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడానికి ప్రయత్నించాలని పెజెష్కియాన్ కు ఈ సందర్భంగా సూచించానని తెలిపారు. పరస్పర చర్చలు, దౌత్య విధానాలను అనుసరించి ప్రాంతీయ భద్రతను నెలకొల్పాలని సూచించారు.

==========================

హోంమంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు రాయ్‌పూర్ చేరుకున్నారు. రాయ్‌పూర్‌లోని బంజరి గ్రామంలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, కేంద్రీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ రెండు జాతీయ సంస్థలను సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... నాగరిక

సమాజంలో హింస, తీవ్రవాదానికి స్థానం లేదని అన్నారు. నక్సలిజాన్ని నిర్మూలించాలని ప్రభుత్వం సంకల్పించిందని, త్వరలోనే దానిని నెరవేరుస్తుందని ఆయన అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను ఆధునీకరించడానికి చర్యలు తీసుకున్నామని హోంమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

రేపు కేంద్ర హోంమంత్రి బస్తర్ డివిజన్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలోని అబుజ్‌మడ్ లో గ్రామస్తులతో, నారాయణ్‌పూర్ జిల్లాలోని ఇర్క్‌భట్టి ప్రాంతంలో ఉన్న సరిహద్దు భద్రతా దళ శిబిరాన్ని సందర్శించి జవాన్లతో మాట్లాడనున్నారు.

===========================

ఇరాన్ తన దేశంలోని అణుస్థావరాలపై అమెరికా చేసిన సైనిక దాడులను తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అని పేర్కొంది. ఈ దాడులకు పర్యవసానాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అమెరికాను హెచ్చరించింది. ఇజ్రాయిల్ అమెరికా సంయుక్తంగా చేపడుతున్న ఈ దాడులకు ఇరాన్ ప్రతిదాడులను ప్రారంభించింది. దుబాయ్ లోని మా ఆకాశవాణి ప్రతినిధి వినోద్ కుమార్ అందించిన సమాచారం మేరకు మరిన్ని వివరాలను ఇప్పుడు విందాం.

(వాయిస్ 38 సెకన్లు)

===========================

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రసంగాల సంకలనంగా తీర్చిదిద్దిన "వింగ్స్ టు అవర్ హోప్స్ - రెండవ సంచికను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రేపు రాష్ట్రపతి భవన్‌లో విడుదల చేస్తారు. గత ఏడాది ఆగష్టు నుంచి ఈ సంవత్సరం జూలై వరకు చేసిన 51 ప్రసంగాలను దీనిలో పొందుపరిచారు. రాష్ట్రపతి భవన్ ద్వారా సంకలనం చేయబడిన ఈ పుస్తకం, కేంద్ర సమాచార - ప్రసార మంత్రిత్వ శాఖ పబ్లికేషన్స్ డివిజన్ ద్వారా ప్రచురించబడింది. హిందీ, ఆంగ్ల భాషలతో పాటు ఇ-వెర్షన్ ని విడుదల చేస్తారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

విరామం

===========================

రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ రేపటి నుండి ఈ నెల 26వ తేదీ వరకు కెన్యా, మడగాస్కర్ దేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా కెన్యాలో రేపు టైటా-టవేటా కౌంటీలో స్మారక స్థూపాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో సంజయ్ సేథ్ పాల్గొంటారు. ఈ నెల 26న అంటాననారివోలో మడగాస్కర్ 65వ స్వాతంత్ర్య మలగసి ఆర్మ్‌డ్ ఫోర్స్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొంటారు.

===========================

సేవా, సుపరి పాలన, పేదల సంక్షేమం అనే మూడు సూత్రాలను అనుసరించి గత 11 సంవత్సరాలుగా భారత ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణల ద్వారా దేశం అనేక రంగాల్లో పురోగతి సాధిస్తోంది. అందులో భాగంగా విద్యుత్ రంగంలో గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో సాధించిన విజయాలపై ఆకాశవాణి న్యూస్ అందిస్తున్న ప్రత్యేక వార్త కథనాన్ని ఇప్పుడు విందాం.

(వాయిస్ 45 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

==========================

లడఖ్‌లోని ద్రాస్‌లో చారిత్రాత్మక కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద ఈరోజు సర్హాద్ శౌర్యథాన్ 2025 కార్యక్రమం నిర్వహించారు. భారత ఆర్మీ, పూణేలోని సర్హాద్ ఫౌండేషన్, కార్గిల్ స్థానిక పౌర పరిపాలన సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించింది. దేశవ్యాప్తంగా 25 వేల మందికి పైగా అథ్లెట్లు పాల్గొన్న ఈ మారథాన్‌ను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... ఇది జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో శాంతి, దేశభక్తి, పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందన్నారు. కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం అభివృద్ధి కోసం మహారాష్ట్ర ప్రభుత్వం తరపున 3 కోట్ల రూపాయల నిధులను అందజేశారు.

==========================

అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీలో భాగాంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ జట్టు 465 పరుగుల ఆలౌట్ అయ్యింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 6 పరుగుల స్వల్ప ఆదిక్యం లభించింది.

==========================

మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్లల్లో రేపటి వరకు అతి భారీ వర్షపాతం నమోదు అవుతుందని భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేస్తూ.. రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు నుండి నాలుగు రోజులు వాయువ్య, ఈశాన్య భారతదేశంలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హిమాచల్ ప్రదేశ్, లడఖ్, జమ్మూ- కాశ్మీర్, పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించాయని IMD తెలిపింది.

==========================

==========================